
సాక్షి
గుంటూరు
శుక్రవారం, 31, జనవరి, 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 552.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వాల్‌పోస్టర్స్ ఆవిష్కరణ

బాపట్ల: స్పర్శ కుష్ఠు నివారణ పక్షోత్సవాల సందర్భంగా గురువారం వాల్‌పోస్టర్స్‌ను కలెక్టర్ జె.వెంకట మురళి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 13 వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు.

విగ్రహాలకు ముసుగులు



నరసరావుపేటఈస్ట్: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో పట్టణంలోని రాజకీయపార్టీల నాయకుల విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగులు తొడుగుతున్నారు.

న్యూస్‌రీల్

వాసవీ అమ్మవారికి 15 కిలోల వెండి వస్తువులు బహూకరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోని అమ్మవారికి సుమారు 15 కిలోల వెండి వస్తువులను పట్టణానికి చెందిన పెరుమాళ్ల రాజేష్, వనజా లక్ష్మి దంపతులు గురువారం బహూకరించారు. అందులో శ్రీ చక్రం ప్లేటు, కూర్మం, సప్త హారతులు, ఏకహారతి, గంటలను వెండితో తయారు చేయించి అందించారు. వీటి విలువ సుమారు రూ.12.5 లక్షలు ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



అచ్చంపేట: మండల పరిధిలోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.62 లక్షల నాబార్డు నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంజూరు చేయించిన విషయం తెలిసిందే. 2023 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి క్రోసూరులో వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ ఇన్ని రోజులకు బ్రిడ్జి నిర్మాణ పనులను కొనసాగించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల మధ్య రాకపోకలను సుగమం చేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

ప్రయాణికురాలి పర్సు కత్తిరించి రూ.2 లక్షల అపహరణ

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి పర్సు కత్తిరించి రూ.2 లక్షల నగదు అపహరించిన ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన కొడవలి సుజాత గుంటూరు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు దిగి మరో బస్సు ఎక్కి చూసుకోగా పర్సులో ఉండాల్సిన నగదు కనిపించలేదు. పర్సు కింది భాగం కత్తిరించబడి ఉంది. సమాచారం అందుకున్న సీఐ విజయ్‌చరణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యార్డులో 1,09,020 మిర్చి బస్తాలు విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,02,729 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,09,020 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 68,402 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 118, బ్యాంక్ కెనాల్‌కు 138, తూర్పు కెనాల్‌కు 244, పశ్చిమ కెనాల్‌కు 122, నిజాంపట్నం కాలువకు 51, కొమ్మమూరు కాలువకు 945 క్యూసెక్కులు విడుదల చేశారు.

పది చదువులు

చిందర వందర!



వంద రోజుల కార్యాచరణ అస్తవ్యస్తం

- నూరుశాతం ఉత్తీర్ణత సాధ్యమేనా!
- స్టడీ మెటీరియల్ ఏదీ?
- అల్పాహారం ఎక్కడ?
- ప్రభుత్వ హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం
- వైఎస్సార్ సీపీ పాలనలో రెండేళ్లపాటు డిసెంబర్ కల్లా స్టడీమెటీరియల్



గుంటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ మోడల్ పేపర్లతో సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పది ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళిక విధానం అస్తవ్యస్తంగా మారింది. మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో జెడ్పీ నుంచి ఇవ్వాల్సిన స్టడీ మెటీరియల్ ఇప్పటికీ విద్యార్థుల చేతుల్లోకి రాకపోవడంతో విద్యార్థుల సన్నద్ధత ప్రశ్నార్థకంగా ఉంది. ఇదిగో ఇస్తాం.. అదిగో ఇస్తామంటూ జెడ్పీ పాలకవర్గం ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యాశాఖాధికారులు గతేడాది నవంబర్ 2నే జెడ్పీ పాలకవర్గానికి అందజేసినా జనవరి నెలాఖరుకూ అది పంపిణీకి నోచుకోలేదు.


ఎస్సీఈఆర్టీ మోడల్ పేపర్లే దిక్కు

మార్చి 17 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనుండటం, జెడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందకపోవడంతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) సిద్ధం చేసిన మోడల్ పేపర్లే దిక్కయ్యాయి. దీంతోపాటు విద్యాశాఖ ఇచ్చిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కూడా సరిగా అమలు కావడం లేదు. ఫలితంగా నూరు శాతం ఉత్తీర్ణత సాధన దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడం పెను సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఎస్సీఈఆర్టీ మోడల్ పేపర్లను పలువురు హెచ్ఎంలు పుస్తక రూపంలో ముద్రించారు. వీటితోపాటు అవే పేపర్లను జిరాక్స్‌లు తీయించి పాఠశాలల్లో విద్యార్థులతో చదివిస్తున్నారు. జెడ్పీ నుంచి స్టడీ మెటీరియల్‌కే దిక్కు లేని పరిస్థితుల్లో అల్పాహారం అందించడం మిథ్యగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా సొంత ఖర్చు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్నారు.

మోకాలడ్డుతున్న ముఖ్య అధికారి!

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేతకు జెడ్పీ పాలకవర్గం మూడు నెలల ముందే ఆమోదించినా.. జెడ్పీలోని ఓ ముఖ్య అధికారి నిర్లక్ష్యం వల్లే స్టడీ మెటీరియల్ ముద్రణ, పంపిణీకి నోచుకోలేదని పాలకవర్గం చెబుతోంది. రెండు రోజుల క్రితం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశంలోనూ ప్రజాప్రతినిధులు స్టడీ మెటీరియల్, అల్పాహారంపై ప్రశ్నలు సంధించినా జెడ్పీ ఉన్నతాధికారిలో చలనం లేకుండా పోయింది. తమ ఆధిపత్యం కోసం 35 వేల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో రెండేళ్లపాటు నిరాటంకంగా..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వరుసగా రెండేళ్లు ''జగనన్న విద్యాజ్యోతి'' పేరుతో స్టడీ మెటీరియల్ రూపొందించి సకాలంలో పంపిణీ చేసిన జెడ్పీ పాలకవర్గం ప్రస్తుతం చతికిలబడింది. 2022 నవంబరులో రూ.61.80 లక్షల జెడ్పీ నిధులతో రాష్ట్రంలోనే తొలిసారిగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా 36,155 మంది విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. తరువాత 2023లో రూ.70 లక్షల వ్యయంతో 39వేల మంది విద్యార్థులకు అందజేశారు. తాజాగా ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలకు సన్నద్ధమవుతున్న 35 వేల మంది విద్యార్థులకు రూ.70 లక్షల ఖర్చుతో స్టడీ మెటీరియల్ పంపిణీకి గత జెడ్పీ సర్వసభ్య సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నా.. ఆచరణలోకి రాలేదు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి



అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలికి సంబంధించి ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించినందున ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చిందని, దీనిని పకడ్బందీగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో వెబ్ ఎక్స్ ద్వారా ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల అధికారులతో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జేసీ భార్గవ్‌తేజతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 29వ తేదీ నుంచే కోడ్ అమల్లోకి వచ్చిందని వివరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు.

ఓటరు నమోదుకు నేడు తుది గడువు

గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదుకు జనవరి 31 వ తేది వరకు అవకాశం ఉందని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. ఫిబ్రవరి 10 వ తేదీ లోపు వాటిని పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులూ ఉండేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించి జనవరి 31 శుక్రవారం సాయంత్రంలోపల వివరాలు పంపాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరగనున్న దృష్ట్యా బ్యాలెట్ బాక్సుల లభ్యత గురించి నివేదిక పంపాలని సూచించారు.

కార్పొరేటర్లను సంతలో పశువుల్లా కొంటున్నారు

- వైఎస్సార్ సీపీ జెండాపై గెలిచిన వారిని ప్రలోభాలకు గురి చేసి తీసుకెళ్తున్నారు
- కేంద్రమంత్రి పెమ్మసాని వ్యాఖ్యలకు అంబటి కౌంటర్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలుపు కోసం కార్పొరేటర్లను టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీ సంతలో పశువుల్లా కొంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి కార్పొరేటర్‌లు ఇంకా లైన్‌లో ఉన్నారన్న కేంద్రమంత్రి పెమ్మసాని వ్యాఖ్యలకు స్పందించిన అంబటి తాను.. లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి కూడా వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు ఎంపీ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దిమాక్ లేదా అంటూ తమపై చేసిన వ్యాఖ్యలపై అంబటి ఘాటుగా స్పందించారు. అవును మాకు దిమాక్ లేదని.. టీడీపీ నేతలకు ఉంటే సూపర్‌సిక్స్ అమలు చేయాలని హితవు పలికారు. పెమ్మసాని కొంచెం తగ్గించుకుంటే బాగుంటుందని.. ఇదీ తాను ఇచ్చే ఉచిత సలహా అని ఎద్దేవా చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు కార్పొరేటర్ల ఇంటికి సంచులు పట్టుకుని తిరుగుతున్నారని, ఈ లిస్టులో పెమ్మసాని కూడా చేరారా అని ప్రశ్నించారు. కేవలం అభివృద్ధి చూసే కార్పొరేటర్లు పార్టీ మారారని దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా అని సవాల్ విసిరారు. మేయర్‌ను అనైతికంగా దించే యత్నాలు చేయటం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఎన్నుకున్న మేయర్ పీఠం కోసం నీచ రాజకీయాలు చేసేందుకు టీడీపీ నేతలు వెనుకాడకపోవటం సిగ్గుచేటన్నారు. నైతిక విలువలు లేకుండా రాజకీయాలు చేసే టీడీపీ నేతలకు వైఎస్సార్ సీపీని విమర్శించే స్థాయి లేదన్నారు.

క్వారీ తిరునాళ్లు సజావుగా నిర్వహిద్దాం

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకోండి
- సమన్వయ సమావేశంలో సబ్‌కలెక్టర్ సంజనా సింహ



అధికారుల సమావేశంలో సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: తెనాలి-గుంటూరు రోడ్డు మార్గంలో వడ్లమూడి వద్ద క్వారీలోని శ్రీబాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అందుకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టంగా చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జరిగిన సమన్వయ సమావేశానికి సబ్‌కలెక్టర్ సంజనా సింహ అధ్యక్షత వహించారు. తిరునాళ్ల జరిగే విధానం, అవసరమైన ఏర్పాట్లు, భక్తులు, సందర్శకుల రాక తదితర అంశాలపై వివిధ శాఖల అధికారుల నడిగి తెలుసుకున్నారు. డీజేల్లో విపరీతమైన శబ్దాల వల్ల గతంలో ఒక అధికారి మృత్యువాత పడ్డారని చెప్పగా, డీజేల శబ్ద కాలుష్యాన్ని కచ్చితంగా తగ్గించాలని ఆదేశించారు. తిరునాళ్లలో ఉంచే జెయింట్ వీల్స్, గ్రామాల నుంచి వచ్చే భారీ ప్రభలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని చెప్పారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీబాలకోటేశ్వరస్వామి తిరునాళ్లకు 60 వేలమందికిపైగా భక్తులు/ప్రజలు సందర్శిస్తారన్న అంచనా ఉందని ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 24,25,26 తేదీల్లో తిరునాళ్ల ఉంటుందని తెలిపారు. ఆర్టీసీ డిపో నుంచి మొత్తం 45 బస్సులు ప్రతి నాలుగు నిముషాలకొకటి చొప్పున తెనాలి-గుంటూరు నడుమ రాకపోకలు సాగిస్తాయని ఆర్టీసీ, తెనాలి డీఎం రాజశేఖర్ చెప్పారు. మంచినీరు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లను చూస్తామని డివిజనల్ పంచాయతీ అధికారిణి స్వరూపరాణి చెప్పారు. ప్రభలపైనా, తిరునాళ్ల ప్రదేశంలో దేవుడి బొమ్మలు మినహా కోడ్ నేపథ్యంలో రాజకీయ నేతల ఫొటోలు ఉండకుండా చూడాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

హామీలు ఎగ్గొట్టేందుకే బాబు తప్పుడు ప్రచారం

- మా నాయకుడు జగన్ జనం కష్టాలు తీర్చారు
- ఆది నుంచి చంద్రబాబుది వంచన నైజం
- 'సాక్షి'తో వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



సాక్షి ప్రతినిధి, బాపట్ల: సూపర్‌సిక్స్ హామీలను ఎగ్గొట్టేందుకే సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ ఆరోపణలకు దిగారని, కథలు, కహానీలు, కాకిలెక్కలు, తప్పుడు ప్రచారాలు పక్కనబెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. చంద్రబాబు తప్పుడు లెక్కలు చెప్పినా కాగ్ లెక్కలు, అధికారిక గణాంకాలను ఎవరూ దాచిపెట్టలేరన్నారు. బాబు దృష్టిలో సంపద సృష్టించడమంటే బాదుడే బాదుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల్లోనే రూ.15 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. భావి తరాల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సృష్టించిన విలువైన సంపద లాంటి మెడికల్ కాలేజీలు, పోర్టులను ప్రైవేటుకు బేరం పెడుతున్నారని విమర్శించారు. ఇవన్నీ దాచిపెట్టి ప్రజల దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఒక ఆర్థిక వ్యవస్థ బాగుందని చెప్పేందుకు మూలధన వ్యయం, అప్పుల వృద్ధి తీరును కొలమానంగా పరిగణిస్తారని లెక్కలన్నీ చూశాక ఆర్థిక క్రమశిక్షణతో ఎవరు పాలన సాగించారో ప్రతి ఒక్కరూ చెబుతారన్నారు. 2023-24లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అత్యధికంగా మూలధన వ్యయం వేసిందని, దాన్ని వదిలేసి చంద్రబాబు ప్రజెంటేషన్ ఇవ్వడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నవారు చేయాల్సిన పనికాదని విమర్శించారు. గతంలో చంద్రబాబు హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో తక్కువగా అప్పులు చేయడమే కాకుండా మూలధన వ్యయం అధికంగా చేసిందన్నారు. 2022-23లో వైఎస్సార్‌సీపీ రూ.67.265 కోట్లు అప్పు చేసి మూలధన వ్యయం రూ.7244 కోట్లు మాత్రమే చేసిందని చంద్రబాబు తప్పుబట్టారని, మరి ఈ ఆర్థిక ఏడాదిలో రూ.78,635.82 కోట్లు అప్పు చేసిన చంద్రబాబు మూలధన వ్యయం రూ.8,894.98 కోట్లే చేసిన విషయాన్ని ఎందుకు దాచి పెడుతున్నారని మేరుగ ప్రశ్నించారు. డీబీటీ ద్వారా నేరుగా రూ. 2.73 లక్షల కోట్లు ప్రజలకు పారదర్శకంగా అందించిన పాలకుడు విధ్వంసకారుడా? ఐదేళ్లలో ఏమీ చేయకుండా మాటలతో మభ్యపెట్టి సింగపూర్ గ్రాఫిక్స్ చూపిన నాయకుడు విధ్వంసకారుడా? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఉద్యోగాలు, ఆర్‌బీకేలు, ఆస్పత్రులు, ఇంగ్లిషు మీడియం స్కూళ్లు తెచ్చిన వ్యక్తి విజన్ ఉన్న వారు కాదా? 14 ఏళ్లు పాలించినా ఏ ఒక్క పథకం నాది అని చెప్పుకోలేని దుస్థితిలో ఉన్న వ్యక్తి విజనరా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చంద్రబాబు కాకిలెక్కలు చెప్పడం మాని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

బాటలపై బూటకం

- సంక్రాంతి వచ్చింది.. వెళ్లింది..
- అమలుకు నోచని సీఎం ఆదేశాలు
- బాగుపడని ప్రధాన రహదారులు
- ప్రమాదాలు యథాతథం..
- ప్రాణాలతో చెలగాటం

'నగరాల్లో ఉంటున్నవారు...ఎన్నారైలు సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు వచ్చే నాటికి రోడ్లన్నీ కళకళలాడాలి.. మన ఊరి రోడ్లు బాగుపడ్డాయని అందరూ సంతోషించాలి.. ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందేశం.. సంక్రాంతి వచ్చింది.. అంతా సొంతూళ్లకు వచ్చారు.. వెళ్లారు..! రోడ్లు మాత్రం కనీస మరమ్మతులకు నోచుకోలేదు. కనీసం ప్రధాన రహదారుల బాగుసేతపైనా సంబంధిత శాఖలు దృష్టి పెట్టనేలేదు. ఫలితంగా ఆ రోడ్లలో ప్రయాణం వాహనచోదకులకు నిత్యం నరకాన్ని తలపిస్తోంది. ప్రమాదాలు జరుగుతూ ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి.



శివలూరు శివారులో ధ్వంసమైన రోడ్డు



అంగలకుదురు-సంగం జాగర్లమూడి మధ్య దెబ్బతిన్న రహదారి



దావులూరు-శివలూరు మధ్య రోడ్డులో ప్రమాదకర గుంత



కొల్లిపర మండల గ్రామం దావులూరు అడ్డరోడ్డు వద్ద ఇలా..

తెనాలి: తెనాలి-గుంటూరు వయా నారాకోడూరు రోడ్డు ... ఈ రహదారిలో రూరల్ మండల గ్రామాలైన అంగలకుదురు-సంగంజాగర్లమూడి మధ్యలో రోడ్డు దెబ్బతిని చాలాకాలమైంది. గత సీజనులో కురిసిన వర్షాలకు మరింత దారుణంగా తయారైంది. దీంతో ఆ రెండు గ్రామాల మధ్య దాదాపు రెండున్నర కిలోమీటర్ల ప్రయాణం దుర్భరంగా ఉందని వాహనచోదకులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు స్లిప్పయి పడిపోయిన ఘటనలున్నాయి. సోమవారం రాత్రి గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువతులను తెనాలి వైపు నుంచి వెళుతున్న మరో వాహనం ఇదే రోడ్డులో ఢీకొంది. కిందపడి పోయిన ఇద్దరు యువతుల్లో ఒకరికి తీవ్ర గాయాలుకాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.అయితే రోడ్డుపై గతుకుల్లో వాహనం నడుపుతూ గోతిని తప్పించే యత్నంలో తన వాహనం ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిందని ఆ యువకుడు చెప్పినట్టు సమాచారం. రోడ్డు మరమ్మతులు జరిగి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదనేది సుస్పష్టం. కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం-గుంటూరు వయా నందివెలుగు రోడ్డు మరో ఉదాహరణ. ఆ రోడ్డులో కొల్లిపర మండల గ్రామం దావులూరు అడ్డరోడ్డు నుంచి చివలూరు వరకు రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. రోజువారీ ట్రాఫిక్ రద్దీతోపాటు కృష్ణాతీరం నుంచి ఇసుకతో వచ్చే భారీ వాహనాల రాకపోకలు ఇక్కడ రోడ్డు ఉసురును రోజురోజుకీ తీసేస్తున్నాయి. దావులూరు నుంచి శివలూరు వరకు రోడ్డు దారుణంగా దెబ్బతింది. భారీ వాహనాలు ఆ గోతుల్లోనూ ఊయల లూగుతూ వెళుతుంటే, ద్విచక్ర వాహనదారులు గతుకుల మధ్యలోనో, సైడులోనే రిబ్బనులా ఉండే తారు రోడ్డులో అతి కష్టంమీద ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా ప్రమాదం అనివార్యమని తెలిసిందే ఈ రోడ్డును కూడా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. సాక్షాత్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనే దుర్భరంగా తయారైన ఎంతో ప్రధానమైన రోడ్డు మరమ్మతులను పట్టించుకోకపోవటం విమర్శలకు గురవుతోంది.

రేపటి నుంచి కందులు కొనుగోలు

పల్నాడు, గుంటూరు జిల్లాల మార్క్‌ఫెడ్ డీఎం ఆర్‌జే కృష్ణారావు



కొరిటెపాడు(గుంటూరు): పల్నాడు జిల్లాలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కందులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని గుంటూరు, పల్నాడు జిల్లాల మార్క్‌ఫెడ్ మేనేజర్ ఆర్‌జే కృష్ణారావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రైతులు పండించిన కంది పంటను కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550లకు నాఫెడ్ తరఫున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ముందుగా కందులు పండించిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 202 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందని వెల్లడించారు. కోసిన కంది పంటను నూర్పిడి చేసి బాగా ఆరబెట్టి శుభ్రం చేసుకోవాలని, శుభ్రం చేసిన కందులలో తేమ శాతం 12 శాతం లోపు ఉండేట్లు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు తమ కందులను తమ సొంత గోనె సంచులలోనే తమకు కేటాయించిన కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు తమ కంది పంట ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు అయినదో లేదో సంబంధింత రైతు సేవా కేంద్రంలో చూసుకోవాలన్నారు. ఈ-క్రాప్‌లో నమోదు కానటువంటి రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేయబడదని స్పష్టం చేశారు. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంక్ అకౌంట్ నంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో పాటు రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంక్ ఖాతాలో మాత్రమే డబ్బులు జమ చేయనున్నట్లు ఆయన వివరించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,700 గరిష్ఠం : రూ. 3,400

మోడల్ ధర రూ. 3,000

క్లుప్తంగా

ఉపాధ్యాయుల వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రానికి పూర్తి వివరాలను టీచర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు. లాంగ్ లీవ్, వీహెచ్, సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులు సైతం విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఒక్క ఉపాధ్యాయుడి పేరు నమోదు కాకున్నా అందుకు సంబంధిత డీడీవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ ఉపాధ్యాయుల పేర్లు ఏ కారణం చేతనైనా టీఐఎస్‌లో కనిపించని పక్షంలో సదరు ఉపాధ్యాయుల వివరాలతోపాటు ట్రెజరీ ఐడీని ఐటీ సెల్‌కు పంపాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 416 పోలింగ్ కేంద్రాలు

- కోడ్ అమలుకు పార్టీలు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వినతి

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్ఓ షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె. శ్రీనివాసరావులతో కలిసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ తరఫున చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ నుంచి చరక కుమార గౌడ్, సీపీఎం తరఫున వై.కృష్ణకాంత్, తెలుగుదేశం పార్టీ నుంచి కంచర్ల శివరామయ్య, జనసేన తరఫున గాదే వేంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అత్తోట జోసఫ్ , కాంగ్రెస్ పార్టీ నుంచి బిల్లా సునీల్, ఆప్ తరఫున టి. సేవా కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 29వ తేదీ నాటికి మొత్తం 3,46,614 మంది ఓటర్లుగా నమోదు అయ్యారని చెప్పారు. 416 పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు జనవరి 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేసు పాల్గొన్నారు.

శాంతి ఆయుధంగా పోరాడిన మహాత్ముడు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అంబటి, మోదుగుల తదితరులు

పట్నంబజారు: విప్లవం, హింస లేకుండా శాంతి యుతంగానే ఏదైనా సాధించవచ్చని చాటి చెప్పిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కీర్తించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుని ఆయన చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగర డిప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షుడు వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. మానవాళికి మంచిగా మెలగటాన్ని నిర్దేశించిన ఘనత బాపూజీదేనన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడిచి, అహింసా మార్గంలో ముందుకు సాగాలన్నారు. మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. భావితరాలకు గాంధీ విలువలను తెలియజెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా గాంధీజీ అంటేనే ఒక గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, పోలూరి వెంకటరెడ్డి, నందేటి రాజేష్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండేపూడి పురుషోత్తం, కొత్తా చిన్నపరెడ్డి, మామిడి రాము, ఆవుల సుందర్‌రెడ్డి, బత్తుల దేవానంద్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, బొర్రా వెంకటేశ్వరరెడ్డి, రాచకొండ ముత్యాల రాజు, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, కార్పొరేటర్‌లు పడాల సుబ్బారెడ్డి, రోషన్, మర్రి అంజలి, అంబేడ్కర్, దూపాటి వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, బూసి రాజలత, మర్రి సత్యన్నారాయణ, పార్టీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలెక్కడ?

- నెరవేర్చకుంటే ప్రజలను మోసం చేసినట్టే
- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- కూటమి సర్కారు తీరుపై మండిపాటు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. హామీల అమలు నుంచి తప్పించుకోవద్దని, అలా చేస్తే ప్రజలను మోసగించినట్టేనని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.13 లక్షల కోట్ల అప్పులు చేసిన కూటమి ప్రభుత్వం.. సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా వదిలేస్తే ఎలా అని ప్రశ్నించారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు కోసం కూటమి నేతలు అడ్డగోలు హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తటం లేదని శివకుమార్ ధ్వజమెత్తారు. సామాజిక పింఛన్లను రూ.వెయ్యి పెంచటం మినహా ఇతర హామీలు అమలు చేయలేదన్నారు. పైగా సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చే పరిస్థితి లేదని తేల్చిచెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చాక అమలు చేసినట్టు శివకుమార్ గుర్తుచేశారు. రైతుభరోసా, అమ్మ ఒడి, చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఆసరా, సున్నా వడ్డీ వంటి పథకాలను వివరించారు. అప్పట్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో పడిందని, రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చంద్రబాబునాయుడు, శ్రీలంక పరిస్థితికి కూతవేటు దూరంలో ఉందంటూ పవన్‌కళ్యాణ్ చేసిన ఆరోపణలను శివకుమార్ ప్రస్తావించారు. ఎన్నికలొచ్చేసరికి తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది విద్యార్థులున్నా రూ.15 వేలు చొప్పున, 18–59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామంటూ కూటమి నేతలు హామీలు ఇచ్చినట్టు తెలిపారు. పైగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందంటూ ఎన్నికల్లో అబద్ధపు ప్రచారం చేశారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో మాట్లాడుతూ రాష్ట్రం అప్పులు రూ.6 లక్షల కోట్లేనని చెప్పినట్టు గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమం కన్నా మరెవరూ ఎక్కువగా ఇవ్వలేరని, చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన హెచ్చరికలు ఇప్పుడు నిజమయ్యాయని శివకుమార్ గుర్తుచేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహిమా, జిల్లా అధికార ప్రతినిధి కొడాలి క్రాంతి, పట్టణ అధ్యక్షుడు షేక్ దుబాయ్ బాబు, రాష్ట్ర నాయకుడు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, కౌన్సిలరు యాతాటి అనిల్, కో ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, బీసీ విభాగం అధ్యక్షుడు పెదలంక వెంకటేశ్వర్లు, కాళిదాసు సత్యం, కోలా వాసు, మల్లెబోయిన రాము, చుక్కా ఆనంద్, కె.నాగమల్లేశ్వరరావు, చుండూరు వెంకటేశ్వరరావు, ఎ.సిరికృష్ణ, షేక్ ఖదీర్, షేక్ ఖాజా, షేక్ చాంద్‌బాషా, పట్టణ అధికార ప్రతినిధి అక్కిదాసు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదరన్ ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం రికార్డ్

గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీవో) అంతర్జాతీయ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఈ నెల 19న గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా 151 మంది మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, విద్యాసంస్థల డైరెక్టర్లకు జాతీయ పురస్కారాలను ప్రదానం చేశామని తెలిపారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది మహిళలు పాల్గొనడంతో అరుదైన కార్యక్రమంగా వండర్ బుక్ రికార్డ్స్‌లోకి ఎక్కినట్లు వివరించారు. ఈ మేరకు రికార్డ్ సంస్థ భారత ముఖ్య సమన్వయకర్త బింగి నరేంద్రగౌడ్ స్వయంగా ప్రపంచ రికార్డు ధ్రువపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

రేపు పింఛన్ల పంపిణీ

నరసరావుపేట: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా శనివారం జిల్లాలో 2,72,932 మంది పింఛనుదారులకు రూ.117.87 కోట్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ బి.బాలునాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలుగా పింఛను నగదు తీసుకోని వారికి మొత్తం అందిస్తామని పేర్కొన్నారు. పింఛను ఇచ్చేందుకు సిబ్బంది ఇంటికి రాకున్నా, డబ్బులు డిమాండ్ చేసినా, ప్రవర్తన సరిగా లేకున్నా.. 91211 90656 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని పీడీ తెలిపారు.

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య



మాచర్ల రూరల్: మండల పరిధిలోని రాయవరం గ్రామ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్ గదిలో 9వ తరగతి విద్యార్థి పంది రాజశేఖర్ (16) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. వెల్దుర్తి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ మధ్యాహ్నం పాఠశాల నుంచి హాస్టల్‌కు వెళ్లి భోజనం చేశాడు. తర్వాత గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యాజమాన్యం రాజశేఖర్‌ను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స నిర్వహిస్తుండగా విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రూరల్ ఎస్‌ఐ పి.రవిబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పారిపోయిన విద్యార్థులు క్షేమంగా ఇంటికి



దాచేపల్లి : చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి పారిపోయిన విద్యార్థులను 24 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. దాచేపల్లి ఎస్‌ఐలు సౌందర రాజన్, పాపారావు గురువారం వివరాలు వెల్లడించారు. మండలంలోని కేసానుపల్లి గ్రామానికి చెందిన మీసాల డేవిడ్, ఇర్లా శ్రీనివాసరావు, నగేష్ కృష్ణ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. బడికి వెళ్లకుండా తిరుగుతుండటంతో వీరిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈ ముగ్గురూ బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి పారిపోయారు. నడికూడి రైల్వే స్టేషన్‌లో రేపల్లె ప్యాసింజర్ ఎక్కి రేపల్లెలో దిగి అక్కడ నుంచి సికింద్రాబాద్ చేరుకుని, జడ్చర్లకు వెళ్లారు. జడ్చర్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న విద్యార్థులు స్థానిక పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి సమాచారం సేకరించి, దాచేపల్లి పోలీసులకు తెలిపారు. పోలీసు సిబ్బంది జడ్చర్లకు చేరుకుని విద్యార్థులను తీసుకొచ్చి, స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తల్లిదండ్రులకు సూచించారు.

కన్న తండ్రిని కాల్వలోకి తోసి చంపిన కొడుకు



ఈపూరు(శావల్యాపురం): కన్న తండ్రినే కాల్వలోకి తోసి చంపాడు కొడుకు. ఈ ఘటన ఈపూరు మండలంలోని భద్రుపాలెం గ్రామం సమీపంలో సాగర్ కుడి కాల్వ వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నూజెండ్ల గ్రామానికి చెందిన గంగినేని కొండయ్య (80)కు ఇద్దరు కొడుకులు. మొదటి కుమారుడు వెంకటేశ్వర్లు నూజెండ్లలో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల కొండయ్య భార్య మృతి చెందింది. గంగినేని వెంకటేశ్వర్లు తండ్రిని చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో తండ్రి కొండయ్యను ఆరోగ్యం సరిగా లేదని చెప్పడంతో వైద్యశాలకు కారులో తీసుకెళ్లాడు. మార్గ మధ్యలో మూత్ర విసర్జన దిగిన కొండయ్యను భద్రుపాలెం సమీపంలోని సాగర్ కెనాల్‌లో వెంకటేశ్వర్లు తోసేసినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈపూరు ఎస్సై ఎం.ఉమా మహేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సాయంతో పోలీసులు కాల్వలోని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మిర్చి యార్డు కార్యదర్శిగా చంద్రిక బాధ్యతల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఎ.చంద్రిక శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ప్రాజెక్టు అధికారిణిగా పనిచేస్తున్న చంద్రికను ఏడాది పాటు డిప్యుటేషన్ మీద కొనసాగేలా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎక్స్ ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా ఆమెను ఏడాది పాటు గుంటూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై నియమించుకునేందుకు మున్సిపల్ పరిపాన శాఖ ఇప్పటికే అనుమతి ఇచ్చింది. మార్కెటింగ్, మున్సిపల్ శాఖల నుంచి ఆమెకు లైన్ క్లియర్ అవ్వడంతో శుక్రవారం ఆమె మిర్చి యార్డు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పనిచేసిన వినుకొండ ఆంజనేయులు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా వెళ్లనున్నారు.


వైద్యవిద్య సీటు పేరిట రూ.12 లక్షల మేరకు మోసం

జేకే కన్సల్టెంట్ ఏజెంట్ రాజేష్‌పై కేసు నమోదు

తాడికొండ: జార్జియాలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ రూ.12 లక్షలు స్వాహా చేసిన ఘటనపై తాడికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.వాసు తెలిపిన వివరాల ప్రకారం... దామరపల్లి గ్రామానికి చెందిన దాసరి యశోదలక్ష్మి తన కుమారుడు వెంకటేష్‌కు ఎంబీబీఎస్ సీటు కోసం గుంటూరుకు చెందిన జేకే కన్సల్టెంట్‌ను సంప్రదించారు. అందులో ఎడ్యుకేషన్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న తుమ్మలపూడి రాజేష్ జార్జియా దేశంలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పలు దఫాలుగా రూ.12 లక్షల నగదు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నాడు. సీటు ఇప్పించకపోగా.. నగదు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వకుండా బాధితులను బెదిరిస్తుండటంతో దాసరి యశోదలక్ష్మి తాడికొండ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తుమ్మలపూడి రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రీసర్వేలో పొరపాట్లకు తావుండకూడదు

జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే



తహసీల్దార్లతో సమీక్షిస్తున్న జేసీ సూరజ్ గనోరే

సత్తెనపల్లి: దీర్ఘకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి రీ–సర్వే తోడ్పడుతుందని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సత్తెనపల్లి నియోజకవర్గంలోని తహసీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ–సర్వేకు మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి, ముప్పాళ్ళ మండలం నార్నెపాడు, రాజుపాలెం మండలం గణపవరం, నకరికల్లు మండలం చాగల్లు గ్రామాల్లో పూర్తి స్థాయిలో రీ–సర్వే వేగవంతంగా జరగాలని ఆదేశించారు. అలాగే సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై సమీక్ష చేశారు. 22 (ఏ), సర్వే నంబర్ లేని భూములకు సంబంధించి మొత్తం ఒకేసారి ప్రతిపాదిస్తే వాటికి ప్రొవిజన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వాటిపై మండలాల వారీగా సమీక్ష చేశారు. ఆర్డీఓ జీవీ రమణాకాంత్‌రెడ్డి, ఆయా మండలా తహసీల్దార్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా కేంద్రం

- కార్యక్రమాల మెరుగుకు ప్రోత్సాహం
- ఉత్తమ పనితీరు చూపితే రూ.లక్ష నజరానా
- జిల్లాలో 70 పంచాయతీలకు ప్రతిపాదన



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తు కొలుస్తున్న కార్యకర్త

సత్తెనపల్లి: పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ్ అభియాన్‌ను ఇప్పటికే కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా సాక్ష్యం, పోషణ్ 2.0 కార్యక్రమాలు అమలు చేస్తోంది. వీటిని మరింత ప్రోత్సహిస్తూ ... ఉత్తమ ఫలితాలు సాధించిన పంచాయతీలకు 'సుపోషిత పంచాయతీ అభియాన్' పేరిట పురస్కారాలు ప్రకటించనుంది. ఎంపికైన పంచాయతీలకు రూ. లక్ష నజరానా అందజేయనుంది. ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరే ప్రామాణికం కానుంది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. తదనుగుణంగా జిల్లా అధికారులు 70 గ్రామ పంచాయతీలను ప్రతిపాదించారు.

పరిశీలన అంశాలివే...

ఇందులో పోషణ్ ట్రాకర్ యాప్ నిర్వహణ కీలకం కానుంది. లబ్ధిదారులను గుర్తించి యాప్‌లో పొందుపరచడం, కేంద్రాల నిర్వహణ, రోజువారీ పనితీరు, చిన్నారుల ఎదుగుదలను పరిశీలించనున్నారు. లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకోవడం, పోషకాహారం సరఫరా, పూర్వ ప్రాథమిక విద్య బోధన, అభ్యాసన, కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతులు, ఎత్తు, వయసుకు తగ్గ బరువు లేని పిల్లల (శామ్, మామ్, ఎస్‌యూడబ్ల్యూల)ను గుర్తించి లోపాల నివారణకు చర్యలు తీసుకోవడం తదితరాలను నిశితంగా పరిశీలిస్తారు. ప్రతిపాదిత పంచాయతీలు పురస్కారాలు సాధించేలా అంగన్‌వాడీ సిబ్బందికి ఐసీడీఎస్ జిల్లా అధికారులు మార్గ నిర్దేశం చేస్తున్నారు. ఎంపికైన పంచాయతీకి రూ. లక్ష ప్రోత్సాహక నగదు ఇస్తారు. అందులో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు 25 శాతం, గ్రామంలో చైతన్య, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు 25 శాతం, అంగన్‌వాడీలో పోషణ వాటికలు, సంబంధిత కార్యక్రమాలకు 50 శాతం నగదు వెచ్చించాల్సి ఉంటుంది.

కీలక తేదీలు ఇవి..

ప్రాథమిక పరిశీలన: ఫిబ్రవరి 15

రాష్ట్ర కమిటీల క్షేత్ర తనిఖీ, బృంద పరిశీలన: ఫిబ్రవరి 15 - జూలై 31

మూడో విడత మూల్యాంకనం: ఆగస్టు, సెప్టెంబర్ నెలాఖరు

ఫలితాలు: సెప్టెంబరు, అక్టోబరు నెలాఖరు

ఫార్మసీ సిలబస్ డిజిటలీకరణకు చర్యలు



సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చేబ్రోలు: పెరుగుతున్న ఇండస్ట్రీ అవసరాలు, టెక్నాలజీలకు అనుగుణంగా ఫార్మసీ సిలబస్‌ను డిజిటలైజ్ చేయబోతున్నామని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ''ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్– ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్'' అంశంపై మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను '' నెక్స్‌జెన్ ఫార్మా కనెక్ట్–2025'' అనే ఇతివృత్తంతో గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా సావనీర్ విడుదల చేవారు. మోంటుకుమార్ ఎం.పటేల్ మాట్లాడుతూ.. పీసీఐ ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు సరికొత్త టెక్నాలజీపై ట్రైనింగ్, స్కిల్స్ పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకట రమణ మాట్లాడుతూ.. పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్ వలన జన్యుపరమైన విశ్లేషణ ద్వారా ఏ ఔషధం రోగికి అనుకూలమవుతుందో ముందుగానే అంచనా వేసి సరైన మందును అందించవచ్చని చెప్పారు. వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్, ఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఎం.విల్లియం కారే, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ పి.శ్రీనివాస బాబు తదితరులు పాల్గొన్నారు.


అంధుల అక్షర శిల్పి బ్రెయిలీ

జిల్లా జడ్జి పార్థసారథి

గుంటూరు రూరల్: అంధత్వం మనిషి శరీరానికే కానీ.. మానవ మేధస్సుకు ఏమాత్రం కాదని నిరూపించిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవీఎస్‌బీజీ పార్థసారథి కొనియాడారు. అంధుల అక్షర శిల్పిగా ఆయనను అభివర్ణించారు. జాతీయ అంధుల సమైక్య అమరావతి శాఖ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు క్లబ్‌లో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో పెద్ద సంఖ్యలో అంధులు పాల్గొనడం విశేషం.

ఈ పోటీలను జిల్లా జడ్జి ప్రారంభించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా తాను అంధత్వాన్ని జయించడమే కాక యావత్ అంధులకు ప్రత్యేక లిపి ద్వారా సరికొత్త లోకాన్ని సృష్టించిన బ్రెయిలీ ఎందరికో ఆదర్శమని పేర్కొన్నారు. కష్టపడితే దరికి రానిది ఏదీ లేదన్న నమ్మకంతో ముందుకు సాగాలని కోరారు. సహాయ, సహకారాలు అందించేందుకు తామంతా సిద్ధంగా ఉంటామని తెలిపారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు ఏపీ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, గుంటూరు క్లబ్ డైరెక్టర్ వి.బ్రహ్మారెడ్డి, కార్యదర్శి ఎస్.సాంబశివరావు, కోశాధికారి ఎం. భూపేన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో గుంటూరు క్లబ్ ఎప్పుడూ చురుకైన పాత్ర పోషిస్తూనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో 4వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలావతి, ఎన్ఎఫ్‌బీఐ అమరావతి కార్యదర్శి పి. లక్ష్మీనారాయణ, కన్నా స్కూల్ కరస్పాండెంట్ కన్నబాబు, షిరిడీ సాయి దీన జన సేవా సమితి చైర్మన్ ఏ పూర్ణచంద్రరావు, ఎన్ఎఫ్‌బీఐ ఏపీ స్టేట్ అధ్యక్షుడు ఎస్.నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఎం. రామసుబ్బయ్య, నేషనల్ సెక్రటరీ కె. .నాగేశ్వరయ్య, ఏపీ జనరల్ సెక్రటరీ బి.విజయ రామారావు, అమరావతి అధ్యక్షుడు ఎస్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యల్లమంద, చినతురకపాలెంలో కలెక్టర్ పర్యటన



గోనె సంచుల తయారీ కార్మికురాలితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: మండలంలోని యల్లమంద, చినతురకపాలెం గ్రామాల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం పర్యటించారు. చినతురకపాలెంలోని గోనె సంచుల తయారీ యూనిట్లను సందర్శించారు. కార్మికుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచుల తయారీ మిషన్ల ఏర్పాటుకు గ్రూపులుగా ఏర్పడితే రూ.10లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని ఊర్దూ పాఠశాలను సందర్శించిన కలెక్టర్‌కు 8వ తరగతి వరకే బోధన చేస్తున్నారని, 9, 10వ తరగతులు ప్రారంభించాలని గ్రామస్తులు విన్నవించారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి సమాధానం ఇచ్చారు. యల్లమందలో గృహ నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాధవిలత, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, ఎల్‌డీఎం రాంప్రసాద్, నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి తమ్మాజీరావు, తహసీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సంస్కృతిలో భాగం ఎడ్ల బల ప్రదర్శన

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల: సంస్కృతి, సంప్రదాయాల్లో ఎడ్ల బల ప్రదర్శన ఒక భాగమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కానుక మాత చర్చి 175 ఏళ్ల తిరునాళ్ల సందర్భంగా గురువారం సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనను ఆయన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. కానుక మాత సన్నిధిలో ప్రశాంత వాతావరణంలో ఎడ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 21 ఏళ్ల తర్వాత రెంటచింతలలో కనుల పండువగా ఈ బల ప్రదర్శనను ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను, సహకరించిన వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు పోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఫిబ్రవరి 7న సెయింట్ జోసఫ్ పాఠశాల వజ్రోత్సవాలకు పూర్వ విద్యార్థిగా తాను బ్రహ్మానందరెడ్డితో కలిసి మళ్లీ వస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులికూరి కాంతారావు, మాజీ వైస్ ఎంపీపీ సుమంత్‌రెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, బి.రామకృష్ణ, ఒ.ఇన్నారెడ్డి, పి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.